క్లుప్తంగా

కుంటను తలపిస్తున్న కాలనీ



నర్మెట : వెల్దండ గ్రామపంచాయతీ సమీపంలోని మూడో వార్డులో రోడ్డుపై మురుగు నీరు నిల్వడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు కాలనీవాసులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం వారు మాట్లాడుతూ.. పంచాయతీ అధికారులకు, సిబ్బందికి చెప్పిన ఫలితం లేదని, దోమలు స్వైర విహారం చేస్తున్నాయని, బయటికి రావాలంటే భయమవుతోందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కాలనీ రోడ్లపై మట్టిని పోయించాలని కోరుతున్నారు.

కొండచిలువ కలకలం



దేవరుప్పుల : మండలంలోని కోలుకొండ గుట్టల సమీపంలో కొండ చిలువ సంచారం వెలుగులోకి రావడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. శనివారం సాయంత్రం ఇదే గ్రామానికి చెందిన వల్లాల ఐలయ్య, కన్నెబోయిన నర్సయ్య గొర్రెలు, మేకలు మేపుతుండగా పొదవాటి కొండచిలువ కదలికలను కనిపెట్టి త్రుటిలో తప్పించుకున్నట్లు తెలిపారు.

ఖాళీలు భర్తీ చేయాలి

● టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు అశోక్

పాలకుర్తి : ఉపాధ్యాయుల ప్రమోషన్ల ద్వారా ఏర్పడిన ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు ఇమ్మడి అశోక్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్వహించిన ప్రమోషన్లతో ఉపాధ్యాయ ఖాళీలు ఏర్పడ్డాయని తెలిపారు.ఉపాధ్యాయులు లేక ఖాళీలతో విద్యా బోధన కరువై విద్యార్థులు నష్టపోతున్నారని చెప్పారు.

నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



జనగామ : లింగాలఘనపురం మండలం నెల్లుట్ల చెరువులో వినాయక విగ్రహాల నిమజ్జన ఏర్పాట్లను గణేష్ ఉత్సవ జిల్లా సమితి ప్రతినిధులు ఆదివారం పరిశీలించారు. అనంతరం సమితి అధ్యక్షుడు మంచాల రవీందర్ మాట్లాడుతూ..ప్రభుత్వం నిమజ్జనం కోసం ఏటా వేలాది రూపాయలు ఖర్చు చేస్తోందని, శాశ్వత ప్రాతిపదికన పనులు చేయాలని కోరారు. శంకర్, రాజశేఖర్, బాలరాజు, ప్రశాంత్, శ్రీమంత్, ప్రదీప్, తదితరులు ఉన్నారు.

గణపతి మండపంలో మంటలు



జనగామ : జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఏరియా దుర్గానగర్ కాలనీలోని గణేష్ మండపంలో ఆదివారం మంటలు చెలరేగాయి. విగ్రహం పక్కన క్లాత్‌కు మంటలు అంటుకొని ఎగిసి పడగా, నిర్వాహకులు పోలీసులు, అగ్నిమాపక శాఖకు సమాచారం అందించారు. వెంటనే ఫైర్ సేఫ్టీ సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను ఆర్పేయడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

హైనా దాడిలో దూడ మృతి



బచ్చన్నపేట : హైనా దాడిలో దూడ మృతి చెందిన సంఘటన మండలంలోని బండనాగారంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన మానెపల్లి మల్లయ్య వ్యవసాయ బావి వద్ద రోజు మాదిరిగానే శనివారం సాయంత్రం పశువులను కట్టి వేసి ఇంటికి వచ్చాడు. ఆదివారం ఉదయం వెళ్లి చూసే సరికి దూడపై హైనా దాడిచేయడంతో మృతిచెంది కనిపించిందన్నారు. గ్రామంలో హైనా దాడిలో పలువురి రైతుల దూడలు చనిపోతున్నాయని సంబంధిత అధికారులు స్పందించి హైనాల బెడదను నివారించాలని అన్నదాతలు కోరుతున్నారు.

అనారోగ్యంతో ప్రభుత్వ ఉపాధ్యాయురాలు..



రిజ్వానా (ఫైల్)

చిల్పూరు : మండల కేంద్రానికి చెందిన ఉపాధ్యాయురాలు మహ్మద్ రిజ్వానా (40) అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందింది. ఈవిషయం తెలుసుకున్న బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే రాజయ్య మృతురాలి భర్త బీఆర్ఎస్ నాయకుడు రాజ్‌మహ్మద్‌ను పరామర్శించారు. నారగోని రాజు, కలకోల రజనీకుమార్, రాజ్‌కుమార్, మాచర్ల ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

యాంత్రీకరణకు ఊతం

రాయితీపై సాగు పరికరాలు

- జిల్లాకు రూ.2.73 కోట్లు మంజూరు
- మహిళా రైతులకు 50 శాతం సబ్సిడీ
- లబ్ధిదారుల ఎంపిక బాధ్యత కమిటీలదే..



ట్రాక్టర్‌తో దమ్ము చేస్తున్న రైతు (ఫైల్)



పొలం కోస్తున్న హార్వెస్టర్ (ఫైల్)

జనగామ రూరల్ : ఏళ్ల తరబడి ఎదురుచూస్తున్న రైతులు యంత్ర పరికరాల కొనుగోలుకు రాయితీతో వ్యవసాయ యాంత్రీకరణకు మోక్షం లభించింది. ఏడేళ్ల తర్వాత వ్యవసాయ పరికరాల కోసం ప్రభుత్వం నిధులు కేటాయించింది. అయితే ఈ ఏడాది కేవలం పరికరాలకే పరిమితం చేశారు. 2025–26కుగాను జిల్లాకు 3.370 యూనిట్లకు రూ.2.73 కోట్లు మంజూరు చేశారు. త్వరలో రైతులకు పరికరాలు అందించేందుకు వ్యవసాయ అధికారులు ప్రణాళిక రూపొందిస్తున్నారు. జిల్లాలో దాదాపు 4లక్షల ఎకరాల్లో రైతులు పంటలు సాగు చేస్తున్నారు. మహిళ రైతులతో పాటు, ఎస్సీ, ఎస్టీ, రైతులకు 50 శాతం రాయితీపై యంత్ర పరికరాలు ఇవ్వనున్నారు. మిగిలిన వారికి 40శాతంతో అందించనున్నారు. ఐదెకరాల కంటే తక్కువ ఉన్న రైతులకు సబ్సిడీపై వివిధ రకాల పరికరాలు అందిస్తారు. స్ప్రేయర్లు, ట్రాక్టర్‌తో నడిచే వ్యవసాయ పరికరాలు రోటోవేటర్లు, నాగళ్లు, గొర్రు, కలుపు తీసే యంత్రాలు, మొక్కజొన్న పట్టే యంత్రం తదితర వాటిని అందించనున్నారు.

ఎంపిక బాధ్యత కమిటీలదే..

యాంత్రీకరణ పరికరాలు అందించేందుకు జిల్లా, మండలస్థాయి కమిటీలను ఏర్పాటు చేయనున్నారు. రాయితీ రూ.లక్ష దాటితే జిల్లా కమిటీ ఆమోదం తప్పనిసరి. ఐదెకరాలలోపు వ్యవసాయ భూమి ఉన్న వారు ఈ రాయితీకి అర్హులు. జిల్లా కమిటీ చైర్మన్‌గా కలెక్టర్, డీఏఓ, ఆగ్రోస్, ఎల్డీఎం, శాస్త్రవేత్తలు సభ్యులుగా ఉండనున్నారు. మండల స్థాయి కమిటీలో ఏఓ, తహసీల్దార్, ఎంపీడీఓలు ఉంటారు. 2017–18 వరకు యాంత్రీకరణ పథకం అమలులో ఉంది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆ పథకాన్ని నిలిపి వేసింది. మళ్లీ ఏడేళ్ల తర్వాత పథకాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోంది. రాష్ట్రీయ క్రిషీ వికాస్ యోజనలో భాగంగా వ్యవసాయ యాంత్రీకరణపై ఉపమిషన్ మార్గదర్శకాల ప్రకారం అమలు చేయనున్నారు.

లక్ష్యాలు..

- చిన్న, సన్నకారు రైతులకు వ్యవసాయ శక్తి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాలకు వ్యవసాయ యాంత్రీకరణను పెంచడం.
- ప్రదర్శన, సామర్థ్య నిర్మాణ కార్యకలాపాలు విభిన్న సమాచార విద్య కమ్యూనికేషన్ ద్వారా స్టాక్ హోల్డర్లలో అవగాహన కల్పించడం.
- వ్యక్తిగత యాజమాన్యం ఆధారంగా వ్యవసాయ యంత్రాలు, పరికరాల సేకరణ కోసం రైతులకు ఆర్థికసాయం అందించడం.
- పంటకు వ్యవసాయ యంత్రాలు, పరికరాల కస్టమ్ నియామక కేంద్రాలను ఏర్పాటు చేయడం.
- గుర్తించిన గ్రామాల్లో గ్రామస్థాయి వ్యవసాయ యంత్రాల బ్యాంకులను ఏర్పాటు చేయడం. వీటి ద్వారా పంట ఉత్పత్తి, ప్రాసెసింగ్ విలువ పెంచి అధిక పంటల ద్వి–ఉత్పత్తి నిర్వహణకు తగిన యాంత్రీకరణ, సాంకేతికతను ప్రోత్సహించడం.

సద్వినియోగం చేసుకోవాలి



రైతుల పంటల సాగుకు ఇబ్బందులు తొలగించడానికి ప్రభుత్వం యాంత్రీకరణలో భాగంగా నిధులు విడుదల చేసింది. అర్హులైన రైతులు సంబంధిత అధికారుల ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.ప్రభుత్వం అందించే యంత్రాల కొనుగోలుకు రాయితీ కల్పించింది. జిల్లాలోనిరైతులు సద్వినియోగం చేసుకోవాలి.

\- అంబికా సోని, డీఏఓ

నెరవేరనున్న రైతుల చిరకాల వాంఛ



పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కొడకండ్ల : స్థానిక ఎమ్మెల్యే మామిడాల యశస్వినిరెడ్డి కృషితో చెన్నూరు, పాలకుర్తి రిజర్వాయర్లకు రూ.1,015 కోట్ల నిధులను క్యాబినెట్ ఆమోదం తెలపడంతో ఈ ప్రాంత రైతుల చిరకాల వాంఛ నెరవేరనుందని కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ అన్నారు. ఆదివారం క్యాబినెట్ ఆమోదం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కొడకండ్ల బస్టాండ్ సెంటర్‌లో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఝాన్సీరెడ్డిల చిత్ర పటాలకు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా సురేష్‌నాయక్ మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకొని ఈ ప్రాంత రైతుల కలను నెరవేర్చారని తెలిపారు. పట్టణ అధ్యక్షుడు మసురం రవీందర్, నాయకులు భిక్షపతి, యాకేష్‌యాదవ్, ప్రసాద్‌రెడ్డి, రామచంద్రయ్య, మహేందర్, రమేష్, యాకూబ్, మధుసూదన్, కనకయ్య పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ దిష్టిబొమ్మ దహనం



చిల్పూరు: దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



కూనూర్‌లో మన్‌కీ బాత్ వీక్షిస్తున్న నాయకులు

చిల్పూరు : బిహార్ ఎన్నికల ప్రచారంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ప్రధాని నరేంద్రమోదీ తల్లిపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా ఆదివారం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో రాహుల్ గాంధీ దిష్టిబొమ్మను దహనం చేశారు. పార్టీ మండల అధ్యక్షుడు గంటె ఉపేందర్‌యాదవ్, బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు బాల్నె శ్రీనివాస్‌గౌడ్, నాయకులు వెలిశాల శ్రీనివాస్, ఊరడి రాజు, రవియాదవ్, రంజిత్, పాలబోయిన జోగులు, రజనీకర్, దోరం శ్రీనివాస్‌తో పాటు తదితరులు ఉన్నారు.

'దేశాన్ని ప్రగతి వైపు తీసుకెళ్తున్న మోదీ'

జఫర్‌గఢ్ : ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలో దేశం ప్రగతి వైపు పయనిస్తోందని బీజేపీ మండల అధ్యక్షుడు కోరుకొప్పుల నాగేష్‌గౌడ్ పేర్కొన్నారు. మన్‌కీ బాత్ కార్యక్రమంలో భాగంగా ఆ పార్టీ ఆధ్వర్యంలో మండలంలోని కూనూర్, జఫర్‌గఢ్, తిమ్మంపేట, షాపల్లి, రఘునాథ్‌పల్లి, ఉప్పుగల్లు గ్రామాల్లో మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలు ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలు గర్వించేలా నరేంద్రమోదీ పని చేస్తున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతోందన్నారు. నరేంద్రమోదీ అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేకనే రాహుల్‌గాంధీ తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల సమయంలో అనేక హామీలు ఇచ్చి అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందన్నారు. నాయకులు బుర్ర తిరుపతి, ఎదులాపురం మదన్‌మోహన్, ఇల్లందుల సారయ్య, కవిత, మారపల్లి రవి, సింగారపు రమేష్, యాదగిరి, రవీందర్, కార్తీక్, బుచ్చయ్య, మహేష్, తాళ్లపల్లి సురేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

హామీలు నెరవేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటమల్లయ్య

జనగామ రూరల్ : కాంగ్రెస్ ప్రభుత్వం గీత కార్మికులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కేజీకేఎస్ జిల్లా కార్యదర్శి బాల్నె వెంకట మల్లయ్య అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో కల్లుగీత కార్మిక సంఘం మండల మహాసభ మార్క ఉపేందర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు కుర్ర ఉప్పలయ్య, ప్రధాన కార్యదర్శి వెంకట మల్లయ్య మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో గీత కార్మికులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని, సేఫ్టీ మోకులు అందజేయాలని కోరారు. వృత్తిలో ప్రమాదవశాత్తు, శాశ్వత దివ్యాంగులకు రూ.10 లక్షలు, తాత్కాలిక దివ్యాంగులకు రూ.లక్ష చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలన్నారు. ప్రతి సొసైటీలో చెట్ల పెంపకానికి 5 ఎకరాలు ప్రభుత్వ భూమి ఇవ్వాలని, జిల్లాలో 48 సొసైటీల భూములకు ఫెన్సింగ్ చేయించాలన్నారు. వడ్లకొండ వెంకటేష్, కుర్రముల సిద్దయ్య, పరుశరాములు, ఆంజనేయులు, అంబాల శ్రీనివాస్, తాళ్లపల్లి అంజయ్య, భాస్కర్, ఉమాపతి పాల్గొన్నారు.

బీసీ రాజ్యస్థాపనకు సిద్ధం కావాలి



జనగామ : బీసీ రాజ్యస్థాపనకు ఐక్య పోరాటానికి సిద్ధం కావాలని బీసీ పొలిటికల్ జేఏసీ నేత కొత్తపల్లి సతీష్ కుమార్ పిలుపునిచ్చారు. ఆదివారం ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న, తెలంగాణ బీసీ పొలిటికల్ జేఏసీ చైర్మన్ సుదగాని హరిశంకర్ గౌడ్‌ను ఆయన మర్యాదపూర్వకంగా కలిసి తన మద్దతును ప్రకటించారు. అనంతరం జిల్లా కేంద్రంలో సతీష్ మాట్లాడుతూ.. 2028లో నిర్వహించే సాధారణ ఎన్నికల్లో బీసీ జెండా ఎగరవేయడమే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

ఏకలవ్య కులస్తులను ఆదుకోవాలి



జెండావిష్కరిస్తున్న రవి, నాయకులు

బచ్చన్నపేట : ఏకలవ్య కులస్తులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలని ఎరుకల హక్కుల పోరాట సమితి, ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు కూరాకుల రవి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఏకలవ్య జాతి స్వీయ గౌరవ పోరాట జెండాను ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆదివాసీ, ఎరుకలకు జనాభా దామాషా ప్రకారం అన్యాయం జరుగుతోందన్నారు. ఏకలవ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి చైర్మన్, డైరెక్టర్లను నియమించాలన్నారు. మండల ఉపాధ్యక్షుడు మానుపాటి నర్సింహులు, కోఆర్డినేటర్ కూరాకుల సుభాష్, నాయకులు సెద్దిని నర్సింహులు, ఉప్పలయ్య, హరి, హరికృష్ణ, యాదగిరి, తేజ, లక్ష్మణ్, రవి ఉన్నారు.

రాములుకు నివాళి



జనగామ రూరల్ : కార్మిక ఉద్యమ నాయకుడు చామకూరి రాములు అని సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని మరిగడి గ్రామానికి చెందిన రాములు అనారోగ్యంతో మృతి చెందగా ఆదివారం సీపీఎం నాయకులు ఆయన మృతదేహానికి పూలమాల వేసి ఎర్రజెండా కప్పి నివాళులర్పించారు. అహల్య, బొట్ల శేఖర్ గోపి, ఉపేందర్, బోడ రాములు, శ్రీనివాస్, దండు శ్రీను, కిష్టయ్య, సిద్దులు, వెంకటయ్య, నారాయణ ఉన్నారు.

సీపీఎస్ అంతం.. పీఆర్‌టీయూ లక్ష్యం

స్టేషన్‌ఘన్‌పూర్ : సీపీఎస్ అంతమే లక్ష్యంగా పీఆర్‌టీయూ పనిచేస్తోందని ఆ సంఘం మండల శాఖ అధ్యక్షుడు గీరెడ్డి ప్రమోద్‌రెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో నేడు చేపట్టనున్న చలో హైదరాబాద్ మహాధర్నా కార్యక్రమంపై ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు సీపీఎస్‌ను రద్దు చేస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిందని గుర్తు చేశారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి దామోదర్‌రెడ్డి పిలుపుమేరకు నేడు చేపట్టనున్న చలో హైదరాబాద్ మహాధర్నా కార్యక్రమానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని ఆయన కోరారు.

'ఎమ్మెల్యే, మాజీ ఎంపీని బహిష్కరించాలి'



రఘునాథపల్లి: సమావేశంలో మాట్లాడుతున్న భిక్షపతినాయక్, పాల్గొన్న సంఘం నాయకులు



జనగామ రూరల్: మాట్లాడుతున్న నాయకులు

జనగామ రూరల్ : ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, సోయం బాబురావు లంబాడీ, బంజారా, సుగాలిలపై అవమానకర వ్యాఖ్యలు చేయడం సరికాదని వీరిని తక్షణమే కాంగ్రెస్ పార్టీ నుంచి బహిష్కరించాలని లంబాడీ, బంజారా సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో గుగులోత్ లచ్చయ్య నాయక్ ఇంటి వద్ద బంజారా ముఖ్య నాయకులు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా లచ్చయ్య మాట్లాడుతూ.. రాష్ట్రంలోని 40 లక్షల మంది లంబాడీల ఆత్మాభిమానాన్ని, గౌరవాన్ని దెబ్బతీయడం, భారత రాజ్యాంగం కల్పించిన హక్కులను అవమానించడం తగదని హెచ్చరించారు. కొన్నేళ్లుగా లంబాడీలపై చేస్తున్న దుష్ప్రచారాన్ని ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం హేయమైన చర్య అన్నారు. సమావేశంలో నాయకులు మూడు లక్ష్మణ్ నాయక్, అజ్మీరా స్వామి నాయక్, గుగులోత్ భోజ్యా, ధరావత్ సోమ్లా, భూక్య వాసు, చందు, లకావత్ నరేష్, బానోత్ జితేందర్ తదితరులు పాల్గొన్నారు.

చిచ్చుపెడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాబురావు


రఘునాథపల్లి : గిరిజనుల మధ్య చిచ్చుపెడుతున్న ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావ్, మాజీ ఎంపీ సోయం బాబురావును కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని లంబాడీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బానోత్ భిక్షపతి నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించిన సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి రాష్ట్రంలో ఒకే భాష, సంస్కృతి, సంప్రదాయం, జీవన విధానం ఉన్న తెగను ఒకే కేటగిరిలో చేర్చాలని 108/1976 పార్లమెంట్ చట్టం ద్వారా రాష్ట్రపతి గెజిట్ ద్వారా లంబాడీలను ఎస్టీ జాబితాలో చేర్చారని గుర్తు చేశారు. వాస్తవాలు తెలియకుండా కొంతమంది స్వార్థపూరిత ఆలోచనలతో కుట్రలు చేస్తున్నారని, ఇలాంటివి మానుకోకుంటే లంబాడీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. సీఎం రేవంత్ రెడ్డి కుట్రదారులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. లంబాడీల హక్కుల పరిరక్షణ కోసం ఐక్యతగా ముందుకు సాగాలని ఆయన పిలుపు నిచ్చారు.ఈ సమావేశంలో సంఘం నాయకులు కేతావత్ మాల్యా నాయక్, బానోత్ వెంకట్ నాయక్, గుగులోత్ కొమురెల్లి, ధరావత్ రమేశ్ నాయక్, తిరుపతి నాయక్, హర్యా నాయక్, ధర్మ, మల్లేష్, సంతోష్, ఈర్య నాయక్, వీరన్న, సేవ్య, అంజి, రవి, రాజు, సేవలాల్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతో శాంతి



దేవరుప్పుల : ఆధ్యాత్మిక చింతనతో సమాజంలో శాంతి నెలకొంటుందని టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. ఆదివారం రాత్రి మండలంలోని పెద్దమడూరు, ధరావత్ తండా, ధర్మగడ్డ తండా, సీతారాంపురం, కామారెడ్డిగూడెం, దేవరుప్పుల తదితర గ్రామాల్లో గణపతి నవరాత్రోత్సవాల్లో ఆమె పాల్గొని పూజలు చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, జిల్లా కార్యదర్శులు పాండు కృష్ణ, ధర్మారెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సత్యనారాయణ, భాస్కర్‌చారి, రెడ్డిరాజుల రమేశ్, పులిగిళ్ల వెంకన్న, రవీందర్, నర్సింహులు, రతన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని బస్‌స్టేజీ కాలనీలో రాకేష్, సీతారాంపురం, కడవెండి, కోలుకొండ, పెద్దమడూరు తదితర గ్రామాల్లో ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం చేశారు.

వినాయకుడికి డీసీపీ పూజలు



జనగామ : పట్టణంలోని గుండ్లగడ్డ కాలనీలో గల వినాయకుడికి డీసీపీ రాజమహేంద్ర నాయక్ ఆదివారం ప్రత్యేక పూజలు చేశారు. పండితులు డీసీపీని సత్కరించి, వేంకటేశ్వర స్వామి జ్ఞాపికను అందించి ఆశీర్వచనాలు అందించారు. అనంతరం వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన చిన్నారులకు డీసీపీ బహుమతులు అందించారు. అలాగే జనగామ పట్టణంలోని బాలాజీనగర్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వినాయక మండపంలో ఆదివారం సామూహిక కుంకుమార్చనలు, వాసవీ కాలనీ–2లో అన్నదానం నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

సీఐ ప్రత్యేక పూజలు



స్టేషన్‌ఘన్‌పూర్ : శివునిపల్లిలోని కృష్ణ కాలనీలో నిర్వహిస్తున్న గణపతి నవరాత్రి ఉత్సవాల్లో ఆదివారం సీఐ జి.వేణు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన అన్నదానం కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీకృష్ణ కాలనీ కమిటీ ఆధ్వర్యంలో సీఐని శాలువాతో సన్మానించారు.

కుంకుమ పూజలు



జఫర్‌గఢ్ : మండల కేంద్రంలో ఆర్యవైశ్య భవనంలో ప్రతిష్టించిన గణనాథుడి వద్ద ఆర్యవైశ్య మహిళలు ఆదివారం కుంకుమ పూజలు నిర్వహించారు. పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో హనుమాన్ గుడి వద్ద ఏర్పాటు చేసిన గణనాథుడి వద్ద అన్నదానం నిర్వహించారు.

మహా అన్నదానం

రఘునాథపల్లి: మండలంలోని వాడవాడలా కొలువైన గణనాథులకు భక్తులు పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో అన్నదానం చేశారు.

లింగాలఘణపురం : మండలంలోని నెల్లుట్ల శ్రీనివాసనగర్ కాలనీలోని గణపతి నవరాత్రోత్సవాల్లో భాగంగా ఆదివారం మహా అన్నదానం నిర్వహించారు. రిటైర్డ్ ఆర్మీ అధికారి సయ్యద్ యూసఫ్ పాల్గొని సేవలు అందించారు.

బచ్చన్నపేట : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో ఆదివారం వినాయక విగ్రహాలకు పూ జలు చేశారు. పలు చోట్ల అన్నదానం నిర్వహించారు.

పాలకుర్తి మండల కేంద్రంలో..



పాలకుర్తి టౌన్ : మండల కేంద్రంలోని రాజీవ్ చౌరస్తా గజానన ఉత్సవ సమితి, దర్దేపల్లి రోడ్డు అంబేడ్కర్ చౌరస్తా వద్ద దాత పెండ్లి భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో శ్రీసోమేశ్వర లక్ష్మీనర్సింహస్వామి ఆలయం వినాయక మండపాల్లో ఆదివారం మహా అన్నదానం నిర్వహించారు.

ఫోక్ సాంగ్ చిత్రీకరణ

జనగామ రూరల్ : మండలంలోని ఓబుల్‌కేశావాపూర్‌లో రేణుకా ఎల్లమ్మ దేవి ఫోక్ సాంగ్ చిత్రీకరణను ఆదివారం మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కంచ రాములు ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నేటి యువత క్లబ్బులు పేరుతో చెడు మార్గంలోకి వెళ్లకుండా తెలంగాణ కట్టు, బొట్టు, బోనం ఆచారాలను కాపాడాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



క్షతగాత్రుడు నరేష్

జఫర్‌గఢ్ : ఆర్టీసీ బస్సు, బైక్ ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఓ వ్యక్తి తీవ్ర గాయపడిన సంఘటన జఫర్‌గఢ్ శివారు వడ్డెగూడెంలో ఆదివారం చోటుచేసుకుంది. ఎస్సై రామ్‌చరణ్, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. వడ్డెగూడెనికి చెందిన బల్లెపు నరేష్ తన బైక్‌పై జఫర్‌గఢ్‌కు వస్తున్నాడు. ఇదే రోడ్డుపై హిమ్మత్‌నగర్ గ్రామానికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. దీంతో బైక్‌పై వస్తున్న నరేష్ తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు చికిత్స నిమిత్తం 108లో వరంగల్‌కు తరలించారు. బాధితుడి తల్లి భారతమ్మ ఫిర్యాదు మేరకు బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ



పరామర్శిస్తున్న పెద్ది రాజిరెడ్డి, నాయకులు

నర్మెట : మచ్చుపహాడ్‌కు చెందిన గొల్లపల్లి శ్రీనివాస్, వస్పారి గట్టయ్య, మామిడాల నర్సమ్మ అనారోగ్యంతో శుక్ర, శనివారాల్లో మృతిచెందారు. కాగా బీఆర్ఎస్ కన్వీనర్ పెద్ది రాజిరెడ్డి పార్టీ శ్రేణులతో కలిసి ఆదివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించి ప్రతీ కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థికసాయం అందజేశారు. కొంపెల్లి రాజు, గుండేటి రాజశేఖర్, మామిడాల వెంకటయ్య, నాగపురి రాజు, సతీష్, బస్కుల రాజ్ కుమార్, కొంపెల్లి రాజేశ్, మామిడాల వెంకట నర్సయ్య, అశోక్, నవీన్, ఎర్రవెల్లి బాబుతో పాటు తదితరులు ఉన్నారు.

సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి



జనగామ రూరల్ : సీజనల్ వ్యాధులతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రముఖ న్యూరాలజిస్ట్, లయన్స్ క్లబ్ జనగామ కింగ్స్ అధ్యక్షుడు డాక్టర్ రంజిత్ కుమార్ అన్నారు.కింగ్స్ క్లబ్ మిలీనియం క్లబ్ సంయుక్తంగా ఆదివారం స్థానిక వీవర్స్ కాలనీలో మెగా వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. లయన్ కన్నా పరశురాములు, డాక్టర్లు విజ్ఞశ్రీ, ప్రీతి దయాల్, నిశాంత్, స్వప్న మూర్తి, లింగమూర్తి, కనకరాజు, నవీన్, శివకుమార్ పాల్గొన్నారు.